క్లుప్తంగా

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

కంకిపాడు: ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్ యోగా మందిర్ సమితి పర్యవేక్షణలో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి వై.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో గాయత్రీవిహార్ కమ్యూనిటీ హాల్‌లో 21వ తేదీ ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్న యోగా దినోత్సవానికి ఎస్ఐ కె.సుధాకర్, ప్రొద్దుటూరు సర్పంచ్ ఈడే శివనాగలక్ష్మి హాజరవుతారని తెలిపారు. యోగ శిక్షకులు, సాధకులు ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి హాజరుకావాలని విజ్ఞప్తిచేశారు.

కౌలుదారులకు రుణాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులు, కౌలుదారులకు అతి తక్కువ వడ్డీ రేట్లకే ట్రాక్టర్లు కొనుగోళ్లకు రుణాలను మంజూరు చేస్తున్నట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టార్ కృషి వికాస్ కేంద్రం (విజయవాడ)సీనియర్ మేనేజర్ ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా నిర్వహణ నిమిత్తం ట్రాక్టర్లు, ట్రక్కు, మిని వ్యాన్ వంటి వాహనాల కొనుగోలు సత్వర రుణాలను అందిస్తున్నట్లు చేస్తున్నట్లు చెప్పారు. రైతులతో పాటుగా భూమిలేని కౌలుదారులకు సైతం ఈ రుణ సదుపాయం కల్పిస్తున్నామని వివరించారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫెర్టిలైజర్స్ దుకాణం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు కూడా రుణాలను అందిస్తున్నామని చెప్పారు. ఫౌల్ట్రీ, డెయిరీ పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి హామీ లేకుండా రుణాలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.120 కోట్ల మేర రుణాలను వ్యవసాయ, అనుబంధ రంగాలకు మంజూరు చేయగా, ఈ ఏడాది రూ.150 కోట్ల రుణ మంజూరు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీనియర్ మేనేజర్ ఎస్.సంతోష్ కుమార్ తెలిపారు. హనుమాన్‌జంక్షన్ బ్రాంచ్ మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తూ భార్యపై దాడి చేసిన భర్తతో పాటు అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు కోడూరు కాలనీకి చెందిన నడకుదుటి అనూషాని గత నాలుగు సంవత్సరాల క్రితం దుర్గాప్రసాద్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే ఇద్దరు ఆడపిల్లలను కన్నావని, పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని అదనపు కట్నం కావాలని గత కొద్ది కాలంగా అనూషాని వేధించసాగాడు. భర్తతో పాటు అత్త లక్ష్మి, ఆడపడుచులు నాగమణి, దుర్గారాణిలు కూడా వేధిస్తున్నారు. కాగా భర్త మంగళవారం భార్య అనూషాని పై భర్త దుర్గాప్రసాద్ ఇంటి నుంచి వెళ్లి పోవాలని దాడి చేశాడు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేయటంతో కేసు నమోదు చేశారు.

అద్దె ప్రాతిపదికపై ఏఎంసీ క్యాంటీన్

గన్నవరం: వ్యవసాయ మార్కెట్ కమిటీ గన్నవరం పరిధిలోని బాపులపాడు సబ్ యార్డులో ఉన్న క్యాంటీన్‌ను అద్దె ప్రాతిపదికపై కేటాయించనున్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకుడు ఏ. కిశోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్యాంటీన్ కేటాయింపు కోసం ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు అదే రోజు ఉదయం పది గంటలలోపు రూ. 5 వేలు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. మరింత సమాచారం కోసం 9182361119 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బదిలీ అయిన ఎంపీడీవోకు సత్కారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: విధి నిర్వహణలో చిత్తశుద్ధి, నిజాయితీ కలిగిన ఉద్యోగులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా, ఈవోపీఆర్డీగా పని చేసి ఇటీవల బదిలీ అయిన కె.ప్రభాకరరావుకు మంగళవారం ఘన వీడ్కోలు పలికారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించారు. పలువురు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం.. సత్కారం



పెనమలూరులో విద్యార్థులను సత్కరిస్తున్న తాతినేని పద్మావతి



గన్నవరంలో నగదు బహుమతి అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు

- ప్రభుత్వ బడిలో ఆణిముత్యాలకు అందలం
- వివిధ స్థాయిల్లో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు సన్మానం
- పెనమలూరు నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి

పెనమలూరు: సర్కారు బడిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆణిముత్యాల పేరుతో ప్రభుత్వం సత్కరించింది. పెనమలూరు, గన్నవరం నియోజవర్గాల పరిధిలోని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాలకు సత్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేడు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించటమే కాకుండా నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నారని వివరించారు. రానున్న కాలంలో ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల నుంచి ఆణిముత్యాలను ప్రభుత్వం తీర్చి దిద్దుతుందన్నారు.

విద్యార్థులకు సత్కారం..

ఇంటర్, పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాలతో సత్కరించారు. ఆకునూరు జూనియర్ కాలేజీకి చెందిన అబ్దుల్ ఈసూబ్, జి.నాగరాజు, ఎస్.సోనా, జి.ఆనంద్ కుమార్, వి.లావణ్యలకు రూ. 15 వేలు చొప్పున నగదు అందించారు. వారికి బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. వారి తల్లిదండ్రులను శాలువతో సత్కరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ విజయశ్రీకి మెమెంటో అందజేశారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కూడా సత్కరించారు. పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాలు పొందిన ఉయ్యూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జి.రామరాజు రూ. 15 వేలు, పెనమలూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మేకల తన్విదుకు రూ. 10 వేలు, గుమ్మా ఉదయ్ కిరణ్‌లకు రూ. 5 వేల నగదు ప్రోత్సాహకంగా పంపిణీ చేశారు. విద్యార్థులకు పతకాలతో పాటు మెరిట్ సర్టిఫికెట్‌లు ఇచ్చి, తల్లిదండ్రులను శాలువ కప్పి సత్కరించారు. ఉయ్యూరు పాఠశాల హెచ్ఎం శ్రవంతి శారద, పెనమలూరు పాఠశాల హెచ్ఎం వై.దుర్గాభవానీని కూడా సత్కరించి మెమెంటో బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈవో కనకమహాలక్ష్మి, సర్పంచ్‌లు కాకర్ల వెంకటరత్నం, లింగాల భాస్కరరావు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీ కోటేశ్వరరావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, కంకిపాడు ఎంపీడీఓ భాస్కర్, ఉయ్యూరు ఎంఈవో సుధారాణి పాల్గొన్నారు.

పాఠశాల 'ఆణిముత్యాలకు' అవార్డులు..

గన్నవరం: విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా తోడ్పాటునందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఆర్. ప్రవీణ్‌పట్నాయక్‌కు రూ. 3 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పవన్‌కుమార్‌కు రూ. 2 వేలు, కారుణ్యకుమార్‌కు రూ. 2 వేలు, మోదుగుమూడి శివకు రూ. వెయ్యి నగదు అందజేశారు. ఎంఈఓలు బీ. శ్రీనివాస్, ఆర్. కమల, హెచ్ఎం ఎన్. రవీంద్రభవాని తదితరులు పాల్గొన్నారు.

తాడిగడప పాఠశాలలో..

పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులను సత్కరించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వరలక్ష్మి, జ్ఞానేంద్ర, సంగీతకు నగదు ప్రోత్సాహకం, మెరిట్ సర్టిఫికెట్, మెడల్ అందజేసి సత్కరించారు. గ్రామ మాజీ సర్పంచ్ మేడసాని రమేష్ బాబు, విశ్రాంత పీడీ కటికల క్రిష్టోఫర్, హెచ్ఎం కనకదుర్గ, తల్లితండ్రుల కమిటీ చైర్మన్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



తాడిగడపలో విద్యార్థిని వరలక్ష్మికి సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ రమేష్‌బాబు

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం..

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని చేపట్టడం హర్షణీయమని పలువురు ప్రజా ప్రతినిధులు కొనియాడారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద మంగళవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రథమస్థానంలో నిల్చిన అప్పన త్రినాథ్‌కు రూ.3 వేలు, ద్వితీయ స్థానం పొందిన సింగిరెడ్డి దినేష్‌కు రూ. 2 వేలు, తృతీయ స్థానం సాధించిన మత్తి దీపికకు రూ. వెయ్యి నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక బహూకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో సత్కరించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ యూసఫ్ పాల్గొన్నారు.



విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పేదరికాన్ని చదువుతోనే జయించాలి..

గన్నవరం రూరల్: పేదరికాన్ని జయించాలంటే చదువు ఒక్కటే మార్గమని జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని అన్నారు. మంగళవారం ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో 2023 ఎస్ఎస్‌సీలో టాపర్‌లుగా నిలిచిన జగనన్న ఆణిముత్యాలను ఆయన ఘనంగా సత్కరించి మెమెంటోలు, సర్టిఫికెట్లు, నగదు రివార్డులు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎంవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో విద్యార్థుల చదువులకు వేలాది కోట్లు ఖర్చు చేస్తుందని చెప్పారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు జరిగిన కృషికి ఈ సంవత్సరం సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విజయాలే నిదర్శనమన్నారు. పాఠశాల టాపర్‌గా రాణించిన షేక్ ఖాజాబీకి రూ.3వేలు ప్రథమ, జాన్‌పాల్‌కు రూ.2వేలు ద్వితీయ, దుర్గ శ్రీ రూ.1000, తృతీయ నగదు రివార్డులను పంపిణీ చేసి మరింత ఉన్నతంగా చదువుల్లో ఎదగాలని వక్తలు ఆకాంక్షించారు. సర్పంచ్ వి.రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు జి.భాగ్యరాజ్, షేక్ మున్ని, ఎస్ఎంసీ చైర్మన్ కందుల రాజేష్‌కుమార్, మండల వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు షేక్ బాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ముస్తాబాదలో జగనన్న ఆణిముత్యాలను సత్కరిస్తున్న జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు

కోదండ రామస్వామికి ప్రత్యేక పూజలు



నున్న శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

నున్న(విజయవాడరూరల్): శ్రీ కోదండరామ స్వామి ఆశీస్సులతో గ్రామస్తులు సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పూజలు చేశారు. నున్న గ్రామంలో మూడు రోజులుగా శ్రీకోదండ రామస్వామి ఆలయంలో ద్వాదశ ప్రతిష్ఠా వార్షికోత్సవం సందర్భంగా మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు మంగళవారం ఎమ్మెల్యే వంశీమోహన్ పాల్గొని శ్రీకోదండ రామస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. అన్నదానం అనంతరం శ్రీకోదండ రామస్వామి వారికి అష్టోత్తర శతకలశ స్నపన మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, అలంకారం, తదుపరి శ్రీసీతారామ కళ్యాణ మహోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది.

భర్తపై దాడి: కేసు నమోదు

పెనమలూరు: భర్తపై భార్యతో పాటు అత్తింటి వారు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప నిమ్రాకాలనీలో ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న ఎండీ కరీం తల్లిదండ్రులు ఎండీ మౌలాలీ, తల్లి ఫాతీ మున్నీసాతో కలిసి ఉంటున్నాడు. అయితే కరీం 2019లో నిడమానూరుకు చెందిన కౌసర్‌ఖాన్‌ను వివాహం చేసుకున్నాడు. వీరు కుటుంబంతో కలసి తాడిగడపలో ఉంటున్నారు. తల్లిదండ్రులతో కాకుండా వేరే కాపురం పెట్టాలని భర్త కరీంతో గొడవ పడి భార్య కౌసర్‌ఖాన్ ఐదు నెలల క్రితం పుట్టింటికి వెళ్లి పోయింది. అత్తింటి వారు వేరే కాపురం పెట్టకపోతే అంతుచూస్తామని కరీంను బెదిరించసాగారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కరీం భార్య కౌసర్‌ఖాన్, మామ ఎండీ ఖాన్, అత్త ముంతాజ్, బంధువులు ముస్తఫా, చోటు, మస్తాన్ మరికొందరు వచ్చి కరీం అతని తల్లిదండ్రులపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ సత్యనారాయణపురంలోని హిమాలయ ట్రెడిషన్ పవర్ యోగా కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, హిమాలయ ట్రెడిషనల్ పవర్‌యోగా సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94411 19909, 94402 76648 సెల్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి కౌలు రైతులకు అవగాహన సదస్సులు

ఉంగుటూరు: అర్హులైన కౌలు రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డుల మంజూరు చేసేందుకు ఈ నెల 21నుంచి గ్రామ సచివాలయం, ఆర్‌బీకేల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. స్థానిక విలేకరులతో తహసీల్దార్, ఏవో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ యజమానికి ఇబ్బంది లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా పథకానికి అర్హులని చెప్పారు. అలాగే సీసీఆర్‌సీ కార్డులపై పంట రుణాలు, ఈ–క్రాప్ బుకింగ్ నమోదు కూడా చేయవచ్చని వివరించారు. 21న పెద్దఅవుటపల్లి, తేలప్రోలు, 22న ఆత్కూరు, పొట్టిపాడు, ఉంగు టూరు, వెల్దిపాడు. 23న ఆముదాలపల్లి, ఇందుపల్లి, నందమూరు, 24న వేంపాడు, తరిగొప్పల, మానికొండ గ్రామాల్లో ఆర్‌బీకేల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు వివరించారు.

అందుబాటులో వరి విత్తనాలు..

గ్రామాల్లోని ఆర్‌బీకేలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు సంప్రదించాలని ఏఓ హరీష్ కుమార్ పేర్కొన్నారు. ఎంటీయూ–1061, ఎంటీయూ–7029, విత్తనాలు కేజీకి రూ.5 సబ్సిడిపై అందజేస్తున్నారని చెప్పారు. అలాగే ఆర్‌పీ బయో–226 అనే కొత్త రకం మినికిట్ ట్రైల్ వెరైటీ వరి విత్తనాలు రైతుకి 10కేజీలు ఉచితంగా ఉంగుటూరు వ్యవసాయ కార్యాలయంలో అందజేస్తున్నామని పేర్కొన్నారు.

బాపులపాడు పరిధిలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: కౌలురైతులకు వేగవంతంగా సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేసేందుకు గ్రామాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు బాపులపాడు మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని మంగళవారం తెలిపారు. 21వ తేదీన కాకులపాడు, కానుమోలు, పెరికీడు, ఆరుగొలను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సీసీఆర్‌సీ కార్డుల క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. 22న తిప్పనగుంట, వీరవల్లి గ్రామాల్లో, 23న బొమ్ములూరు, కొత్తపల్లి, మడిచర్లలో, 24న రంగన్నగూడెం, రేమల్లే, వేలేరు, ఎ.సీతారామపురం, 26న బండారుగూడెం, బాపులపాడు, 27న కె.సీతారామపురం, కోడూరుపాడు, 28న ఓగిరాల, మల్లవల్లిలో క్యాంపులు నిర్వహించనున్నట్లు ఏవో తెలిపారు.

చురుగ్గా ఆర్‌బీకే భవనం పనులు

గొడవర్రులో రూ. 21.80 లక్షలతో నిర్మాణం



గొడవర్రులో నిర్మాణంలో ఉన్న రైతుభరోసా కేంద్రం

కంకిపాడు: రైతుభరోసా కేంద్రం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కేంద్రం నిర్మాణం పూర్తయితే అన్నదాతలకు మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణం శ్లాబ్ దశను పూర్తి చేసుకుంది. మండలంలోని గొడవర్రు గ్రామంలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రధాన గ్రామంలోని చెరువు వద్ద జాతి నేతల విగ్రహాల కూడలి వద్ద ఉన్న సామాజిక స్థలాన్ని రైతుభరోసా కేంద్రం నిర్మాణం కోసం సేకరించారు. ఈ స్థలంలో 2022 సెప్టెంబర్ 21న ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్‌లు ఆర్‌బీకే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం శ్లాబ్ పనులు పూర్తవగా.. గదుల నిర్మాణం ప్రారంభం కావాల్సి ఉంది. ప్రస్తుతం రైతుభరోసా కేంద్రం పీఏసీఎస్ కార్యాలయంలో నడుస్తోంది. ఆ కేంద్రంగానే రైతులకు అవసరమైన అన్ని సేవలను రైతుభరోసా సిబ్బంది అందిస్తున్నారు. ఆర్‌బీకే నిర్మాణం పూర్తయితే అన్ని వసతులతో కూడిన భవనం సమకూరుతుంది. తద్వారా సీజన్‌కు అనుగుణంగా అవసరమైన అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని రైతులు ఆశతో ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి–సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నున్న గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన మూడో గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.50లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే వంశీమోహన్ సర్పంచి కాటూరి సరళ, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచి బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనీకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్ తదితరులు పాల్గొన్నారు.



నున్నలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

అంపాపురం పాల సొసైటీ అధ్యక్షుడిగా మోహనరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని అంపాపురం పాల ఉత్పత్తిదారుల సహకార సొసైటీ అధ్యక్షుడిగా గోళ్ల మోహనరావు మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సొసైటీలో ఖాళీ అయిన రెండు డైరెక్టర్ల పదవులకు మంగళవారం కృష్ణా మిల్క్ యూనియన్ అధికారుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. గత పదేళ్లుగా అంపాపురం పాల సొసైటీ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న మోహనరావు పదవీకాలం ఇటీవల ముగియటంతో ఆయన మరోసారి డైరెక్టర్ ఎన్నికల్లో పోటీ చేసి ఏకగ్రీవంగా గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పాల కేంద్రం పాలకమండలి సమావేశంలోనూ మోహనరావునే అధ్యక్షుడిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మరో మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. తన ఎన్నికకు సహకరించిన గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, అంపాపురం సర్పంచ్ కాకాని సంజయ్ కుమార్, పాల సొసైటీ సభ్యులకు మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు.

రోజువారీ విధుల్లో హిందీ తప్పనిసరి

డీఆర్ఎం షివేంద్రమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రోజువారీ విధుల్లో అధికార భాష హిందీని తప్పనిసరిగా ఉపయోగించాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం షివేంద్రమోహన్ పేర్కొన్నారు. డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 183వ డివిజనల్ అధికార భాష అమలు కమిటీ సమావేశం డీఆర్ఎం అధ్యతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా షివేంద్రమోహన్ మాట్లాడుతూ.. జాతీయ సమైక్యత కోసం అధికార భాష ప్రాముఖ్యతను వివరించారు. రోజువారీ వీధుల్లో రాజభాష హిందీని ఉపయోగించడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అన్నారు. అధికార భాష చట్టం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాల్సిందిగా సూచించారు. అనంతరం రాజభాష అధికారి ఆశా మహేష్ కుమార్ డివిజన్‌లో అధికార భాష అమలులో సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ త్రైమాసికంలో డివిజన్ వ్యాప్తంగా ఉద్యోగులకు నిర్వహించిన హిందీ సెమినార్‌లు, వర్క్‌షాపులు, టేబుల్ శిక్షణ తదితర వివరాలు వెల్లడించారు. ముందుగా ఈ ఏడాది మార్చిలో కపుర్తలలో జరిగిన అఖిల భారత రైల్వే హిందీ నాటక పోటీలలో డివిజన్ రెండో స్థానం సాధించడంపై అధికారులను అభినందించారు. ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, డి.శ్రీనివాసరావు, ఏసీఎంఎస్ డాక్టర్ రవికాంత్, సీనియర్ డీఈఎన్ ఇ.శాంతారామ్, డీసీఎం ఎండీ అలీఖాన్ పాల్గొన్నారు.

23వ తేదీ నుంచి 'జగనన్న సురక్ష'



మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి

విజయవాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రారంభమవుతుందని మండల తహసీల్దార్ పి.జాహ్నవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని వలంటీర్లు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి నమోదు చేసుకొంటారన్నారు. అర్హత గల వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందనివారి వివరాలు, ఇతర సమస్యలు నమోదు చేసుకొని వాటిని ఉన్నతాధికారులకు తెలియజేస్తారన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీ శేషగిరిరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకానికి పకడ్బందీగా నిర్వహించడానికి మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. బీవీ శేషగిరిరావు,(ఎంపీడీఓ)ఆర్ఐ పి.హరీష్, పి.జాహ్నవి(తహసీల్దార్) శ్వేత(ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ), పి.సలీమ్‌ఖాన్(డెప్యూటీ తహసీల్దార్), కె.వెంకటరత్నం(ఎంఈవో) ఈ టీంల పర్యవేక్షణలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. వాటిని పరిష్కరిస్తామన్నారు.

కానూరులో పోలీసుల తనిఖీలు

పెనమలూరు: వాణిజ్య పన్నుల శాఖ అధికారుల అవినీతి కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరి ఇళ్లలో పోలీసులు మంగళవారం తనిఖీలు చేశారు. వాణిజ్యపన్నుల శాఖలో పని చేస్తున్న సబార్డినేట్ ఎం.సత్యనారాయణ, అధికారి కె.సంధ్య ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. కానూరులో టీచర్స్‌కాలనీలో ఇంట్లో, అదే విధంగా కానూరు మైత్రినగర్‌లో అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు చేశారు.